
# మహానగరం కథలు

## -వేదుల సుభద్ర





*మహానగరం కథలు*

**ఢిల్లీ, బొంబాయి, బెంగుళూర్, హైదరాబాదు, లండన్, పారిస్, న్యూయార్క్. పేరేదైనా, స్వదేశమైనా, విదేశమైనా.** ఉన్నది ఎక్కడైనా, తీరు, తెన్నూ ఒకటే.. ఆకాశాన్నంటే మేడలూ. ఇబ్బడి ముబ్బడిగా పెరుగుతున్న వాహనాలూ, జనాభా, మారుతున్న ప్రజలూ, తరుగుతున్న వనరులూ మానవతా విలువలూ, రోజురోజుకీ చేరుతున్న ఊహకందని మార్పులూ, ఎటువైపో తెలియని జీవన పయనాలు.వెరసి. గజిబిజి బ్రతుకుల ఉరుకుల పరుగులతో .. మహానగరాలన్నీ "యమహా" నగరాలవుతున్నాయి.

కాలుష్యమూ, యాంత్రికీకరణా, మెటీరియలిజమూ, స్వార్ధమూ, మనుష్యులమధ్య పెరుగుతున్న దూరాలూ, ఆర్ధికసంబంధాలే జీవిత సంబంధాలనుకునే రోజులూ ... ఇవేనా నగరాలలోకనిపించేది? ఇంతకు మించి మరేమీ లేదా? కాదు.. తరచి చూస్తే ఆవేశాలూ, ఆనందాలూ, పురోగమనాలూ, బాంధవ్యాలూ, పోటీ తత్వాలూ, గెలుపిచ్చే సంతోషాలు. పంచుకుంటే పెరిగే సుఖాలూ మాట విరుచుకుంటే మిగలని సంబంధాలూ, వెతలే కాదు.. కతలూ కనిపిస్తాయి..

అత్యంత సంపన్నులూ, అతి నిరుపేదలూ కలిసి ఆకాశమనే ఇంటికప్పుకింద కలిసి చేసే సహజీవనాలే మహానగరాలు. ఓపికుండి వింటే సాలభంజికలని మించి చెప్పే కథా సాగరాలు. నిత్యం మారుతున్న మన రోజువారీ జీవన చిత్రాలు.. ఈ మహానగరం కథలు..!!

# హాలిడే

***కేరళ రాష్ట్రంలో అలెప్పీ, కుమరకం*** అనే రెండు ఊర్లని కలుపుతూ "హౌస్ బోట్" అనే అరుదైన అనుభవాన్ని అందించే వెంబనాడ్ లేక్ లోని ఒక హౌస్ బోట్లో ఉన్నారు వినయ్, లతిక.

రకరకాల వసతులతో, ఇంటిని తలపిస్తూ ఉండే ఆ గూటిపడవలనే హౌస్ బోట్ లంటారు, ప్రతీ బోట్ లోనూ దానికి తగ్గ సిబ్బందీ, చిన్న వంటగదీ, పడకగదులూ, టీవీ, వీడియో లాంటి వసతులన్నీ ఉంటాయి. ఆ సరస్సునీ, ఈ హౌస్ బోట్ లనీ జీవనాధారంగా చేసుకుని కొన్ని వేలమంది బ్రతుకుతారు.

కుమరకం, అల్లెప్పీ ల మధ్య వెంబనాడ్ లో తిరిగే ఆ బోట్ లన్నీ మధ్యాహ్నం పన్నెండుగంటలకి బయలుదేరతాయి. అలా మొదలైన ఆ ప్రయాణం ఆ సరస్సు అందాలు చూసుకుంటూ సాయత్రంవరకూ సాగి, రాత్రికి ఆగుతుంది, మర్నాడు పొద్దున్నే అల్పాహారం తర్వాత మళ్ళీ బయలుదేరి తీరం చేరుతుంది. దాదాపు ఒక రోజంతా ఆ బోట్ లో ఉండడం నిజంగా మంచి అనుభవం.

టైము రెండు దాటుతోంది, లంచ్ కోసం దాదాపు నలభై నిమిషాలు ఆపిన బోట్ అప్పుడే మొదలయింది.

"కాబేజీ కొబ్బరి కూర, బీన్స్ కూర, సాంబార్, అప్పడాలు, అన్నం, పెరుగు, పాయసం, భోజనం బావుంది కదూ" అన్నాడు వినయ్. లతికేమీ మాట్లాడలేదు.

" ఆమె అలక ఇంకా తీరలేదు" అని గ్రహించాడు వినయ్.

" ప్రేమ యాత్రలకు కేరళ వచ్చి ఇలా బుంగమూతి పెట్టుకుంటే బావుంటుందా చెప్పు?" అన్నాడు నవ్వుతూ. లతిక నవ్వలేదు. ఏదో ఆలోచిస్తున్నట్టు మౌనంగా ఉంది, దూరంగా కనబడుతున్న కరెంటు వైర్లనీ, వాటిమీద వరసగా ఆగి ఉన్న పక్షులని చూస్తోంది. ఆమె మనసంతా ఎక్కడో ఉంది, మనసులో ఎక్కడో తన మాట నెగ్గలేదన్న భావన ఆమెని అశాంతికి గురిచేస్తోంది. అది గ్రహించడానికి అట్టే టైము పట్టలేదు వినయ్ కి.

"తన మాట కాదని తప్పు చేశానా ?" అని ఒక్క క్షణం బాధ వేసింది, మరోసారి మాట్లాడించడానికి ప్రయత్నించాడు.

" నాకు నిద్రొస్తోంది, పడుకుంటాను" అంటూ బోట్లోని రూం లోకి వెళ్ళింది.

ఆమె సంగతి బాగా తెలిసిన వినయ్ చిన్నగా నవ్వుకున్నాడు." కోపం, బాధా ఏదీ ఎక్కువసేపు ఉంచుకోలేదు తను, కాసేపట్లోనే మళ్ళీ మామూలుగా అయిపోతుంది, గుర్తొచ్చినప్పుడల్లా కాస్త సాధిస్తుంది అంతే, ఇప్పుడు మాట్లాడించి గొడవ చేసుకోవడంకంటే తనని కాసేపు వదిలెయ్యడమే మంచిది, మహా అయితే అరగంటలో అంతా మర్చిపోతుంది" అనుకున్నాడు ఆమె వెళ్ళిన వైపే చూస్తూ.

డెక్ మీద కుర్చీలో కూర్చుని పుస్తకపఠనంలో పడ్డాడు. 'ఇన్నాళ్లకి తను అనుకున్నట్టుగా హాలిడే కి వెళ్తున్నాడు అదే సంతోషం ' అనుకుంటూ ఉండగానే లతిక తిరిగి వచ్చింది.

ఇందాకటిలా కాక ఇప్పుడు ముఖం ప్రసన్నంగా ఉండడం చూసి వినయ్ కి సంతోషం వేసింది.

"రూం కూడా బావుంది" అంది లతిక అతని పక్కన కూర్చుంటూ. "ఊ" అన్నాడు అతను.

" ఐ లైక్ ఇట్" అంది అతని భుజం మీద తల వాలుస్తూ. చిన్నగా నవ్వాడు.

" ఈ వాతావరణం, ఈ ఏకాంతం. ఈ పరిసరాలు, ఇవన్నీ చాలా బావున్నాయి కదూ! అంది.

"కదా" అన్నాడు, అంతే కానీ వారం క్రితం తమ ఇద్దరి మధ్యన జరిగిన సంభాషణని గుర్తు చేసి దెప్పే ప్రయత్నం చెయ్యలేదు. అదే వినయ్ లో ఆమెకి నచ్చే గుణం, అప్రసన్నమైన విషయాలని ఎప్పుడూ గుర్తు చెయ్యడు.

లేక్ మీద నించి చల్లని గాలి వీస్తోంది, మధ్యలో చిన్న జల్లు పడింది, వాతావరణం చాలా ఆహ్లాదకరంగా ఉంది.

నాలుగ్గంటలవుతుండగా బజ్జీలు, టీలతో వచ్చాడు బోట్ లోని కుక్. తాగుతూ ఇద్దరూ కబుర్లలో పడ్డారు, దూరంగా ఎగురుతూ కనిపిస్తున్న పక్షులూ, లేక్ ని ఆనుకుని ఉన్న పంటచేలు. ఎటు చూసినా నీరు, పచ్చదనమూ, వాటిని ఆస్వాదిస్తూ కబుర్లలో కాలమే తెలియలేదు వారికి. ఆరుగంటలవుతుంటే బోట్ ని పంటచేను గట్టు కి దగ్గరగా లాగి లంగరు వేశారు బోట్ వాళ్ళు.

"ఇక్కడ కావాలంటే కాసేపు దిగవచ్చు సార్ గట్టు మీదకి, రాత్రి ఇక్కడే ఆపుతాం, పొద్దున్నే మళ్ళీ బయలుదేరతాము" అని చెప్పాడు బోట్ అతను. మిగతా బోట్లు కూడా దగ్గరలోనే ఆగడం మొదలుపెట్టాయి.

ఇద్దరూ బోట్లోంచి కిందకి దిగి చేల వైపు నడవడం మొదలు పెట్టారు. కొబ్బరాకు చాటునించి అస్తమిస్తున్న సూర్యుడు అందంగా కనిపిస్తున్నాడు.

"వినూ, నిజంగానే కేరళ ఎంత అందమైన ప్రదేశం కదూ, ఊరికే అన్నారా " గాడ్'స్ ఓన్ కంట్రీ " (God's own country) అని, చూస్తున్న కొలదీ నాకు మరింత బావుంది," అంది లతిక. అలా అంటున్న ఆమెని ఫోటో తీస్తూ నవ్వాడు.

"వెలుగు ఉండగా కాసేపు పుస్తకం చదువుకోనా? లేదా అలా కాసేపు తిరిగి వద్దామా? " అన్నాడు నవ్వుతూ.

" సరే, నువ్వు చదువుకో, నేను అలా కాసేపు తిరిగి వస్తాను" అంది నవ్వుతూ.

"ఎక్కువదూరం వెళ్ళకు" అన్నాడు వినయ్.

మెల్లిగా నడుస్తోంది ఆమె, గతవారం జరిగిన సంభాషణ ఎంత వద్దన్నా ఆమెకి గుర్తొస్తోంది, అప్పుడు వినయ్ ఆర్గ్యుమెంట్ అర్ధం లేనిదిగా అనిపించింది కానీ చూస్తుంటే అతను చెప్పిన దాంట్లో ఎంత నిజముందో! అనిపిస్తోంది.

-----

"సంతోష్, శిల్పా వాళ్ళతోనా!, నేను చస్తే రాను హాలిడే కి" సోఫా మీద బాసింపట్టు వేసుకుని కూర్చుంటూ అన్నాడు వినయ్.

"అది కాదు వినయ్, నేను చెప్పేది వినకుండానే అలా అనేస్తావేం? "అంది లతిక చిరుకోపంతో.

"అమ్మాయీ, నువ్వూ, నీ ఫ్రెండ్ శిల్పా, వారి సదరు భర్తగారు సంతోష్ గారు కలిసి వేసే ప్లానులూ, హాలిడేలూ నాకూ, నా ఒంటికీ పడవు, దయచేసి నన్నొదిలేయండి. ఆ! నీకు కావాలంటే నువ్వొక్కర్తివే వెళ్ళు, నాకభ్యంతరం లేదు, నేను హాయిగా ఇదిగో, మన బాల్కనీలో కూర్చుని టీ తాగుతూ, పుస్తకాలు చదువుకుంటూ బతికేస్తాను నువ్వొచ్చేవరకూ"

అత ని మాట పూర్తి కాకుండానే లతిక చేతిలోని కుషన్ వచ్చి సరిగ్గా అతని ముఖం మీద పడింది.

" అబ్బా, పోయి పోయి ఈ బాస్కెట్ బాల్ ప్లేయర్ ని చేసుకున్నాను చూడు, నీ గురి ఎప్పుడూ తప్పదేం?" అంటూ దెబ్బ తగిలిన ముక్కుని రుద్దుకోసాగాడు.

అతన్ని అలా చూసిన లతిక "మనతో పెట్టుకుంటే అలాగే ఉంటుంది, ఇంకోసారి అంటావా అలా?" అంది మరింత కోపంతో.

"అనను తల్లీ, దేవిగారు ఒక్క కప్పు కాఫీ ఇప్పిస్తే నేను బుద్ధిగా పుస్తకం చదువుకుంటాను అన్నాడు, అమిష్ త్రిపాఠీ పుస్తకం చేతిలోకి తీసుకుంటూ.

" ఈరోజు ఈ సంగతి తేలకుండా కాఫీ కాదు కదా, గేస్ వెలిగించడం కూడా కుదరదు" అంది పంతంగా.

"ఒహో, అయితే దొరికాడు వినయ్ ఇవ్వాళ, సరే తప్పుతుందా, చెప్పండి మేడం "అన్నాడు వినయ్.

లతిక ఒక పేరున్న ఇంజనీరింగ్ కాలేజీలో లెక్చరర్ గా పనిచేస్తోంది, వినయ్ చార్టర్డ్ అకవుంటెంట్, పవర్ వాటర్ కూపర్ లో పనిచేస్తాడు. శిల్ప, లతిక సహోద్యోగి, ఆమె భర్త సంతోష్, ట్రావెల్ ఏజెన్సీ నడుపుతాడు. రెండు జంటలదీ దాదాపూ ఒకే వయసు కావడంవల్లనూ, శిల్పా, లతికా సహోద్యోగులు కావడంవల్లనూ వారిమధ్య స్నేహం ఏర్పడింది.

సంతోష్ వాళ్ళ నాన్నగారి దగ్గరనించీ ట్రావెల్ ఏజెన్సీ బిజినెస్ లోనే ఉన్నారు, దానివల్ల అతను ఎప్పుడైనా చవగ్గా టికెట్లు దొరికితే తాము ఉపయోగించుకోవడమే కాక, బంధువులకీ, స్నేహితులకీ కూడా చెప్తూ ఉంటాడు. అందరూ అతనెప్పుడు అలాంటి అవకాశాల గురించి చెప్తాడా? అని ఎదురు చూస్తూ ఉంటారు కూడా. లతికా, వినయ్ లతో పరిచయం అయ్యాకా, రెండు సార్లు అలాంటి ట్రిప్ లకి వెళ్ళారు నలుగురూ కలిసి, మొదటి సారి ఢిల్లీ, ఆగ్రా వైపు, రెండో సారి సింగపూర్ కి.

"బాంకాక్ కి మంచి డీల్స్ ఉన్నాయిట, హోటెల్ తో కూడా కలిపి, నిన్ననే శిల్ప అంది, మీరిద్దరూ వస్తామంటే అందరం కలిసి వెళ్ళవచ్చు అని, వాళ్ళ అక్కా, బావా కూడా వస్తారుట, నీకు తెలుసు కదా వాళ్ళు, మనతో సింగపూర్ వచ్చారు కదా, ఇంకా వాళ్ళవాళ్ళెవరో మరొక నలుగురు ఉన్నారుట, అందరికీ కలిపి బుకింగ్ చేస్తే చాలా బాగా కలిసి వస్తుంది అంది "అంది.

వినయ్ వినడం లేదు, కిటికీ లోంచి బయటకి చూస్తున్నాడు, బయట వర్షం పడుతోంది, ఒక పక్కనించి ఎండగా ఉంది, వాన చినుకులమీద పడిన కిరణాలు అందమైన హరివిల్లుని ఆవిష్కరిస్తున్నాయి, దాన్నే చూస్తున్నాడు అతను.

" నేను చెప్పేది వినడం లేదు కదూ, నువ్వెప్పుడూ ఇంతే, ఐ డోంట్ నో వాట్ ద ప్రాబ్లెం ఈస్?" అని కోపంగా లోపలకి వెళ్ళిపోయింది లతిక.

లోపలకి వెళ్ళినది మళ్ళీ రెండు నిమిషాలకే నైట్ డ్రెస్ వేసుకుని వచ్చింది చేతిలో రెండు కాఫీ కప్పులతో. ఒకటి అతనికిచ్చి తనొకటి తీసుకుంటూ అంది.

"అది కాదు వినయ్, మనం హనీమూన్ కి బాంకాక్ వెళదామనుకున్నాం గుర్తుందా, అప్పుడు కుదరలేదు, కనీసం ఇప్పుడు మంచి అవకాశం ఉన్నప్పుడు వెళ్ళచ్చు కదా అంది ఆశగా.

లతికా వాళ్ళదీ విశాఖపట్నం దగ్గర ఉన్న ఒక పల్లెటూరు, ఆమె తండ్రి అదే స్కూల్ లో డ్రిల్ మాస్టర్ గా పనిచేశేవాడు, పిల్లలని ఎప్పుడూ క్రమశిక్షణగా పెంచడంలో ఆయనకున్న శ్రద్ధ మరి దేంట్లోనూ ఉండేది కాదు, దానికి తోడు లతికకి చిన్నప్పటినించీ బాస్కెట్ బాల్ లో శిక్షణ ఇచ్చేవాడు, ఎలాగైనా నేషనల్ లెవెల్ కి పంపాలని అతని ఆశ, స్కూల్ వేళల్లో చదువులూ, పరీక్షలూ, అదవగా నే బాస్కెట్ బాల్ కోచింగూ ఇలా ఇద్దరూ కూడా చాలా బిజీగా ఉండేవారు. ఎప్పుడో ఒకసారి మొక్కు తీర్చుకోవడానికి సింహాచలమో, ఎదైనా టోర్నమెంట్ కోసమో తప్ప వారి కుటుంబం ఎప్పుడూ, ఎక్కడికీ వెళ్ళలేదు. లతిక స్టేట్ లెవెల్లో చాలా సార్లు టోర్నమెంటుల్లో పాల్గొని గెలిచింది. మంచి మార్కులతో ఇంజనీరింగ్ పూర్తి చేసి, తనకిష్టమైన టీచింగ్ ని వృత్తిగా ఎంచుకుంది. ఆమెకి మొదటినించీ ఊర్లు తిరగడం అంటే చాలా ఇష్టం. వినయ్ తో పెళ్ళి జరగకముందు స్నేహితురాళ్ళతో కలిసి చిన్న చిన్న ట్రిప్ లకి వెళ్లేది, అందరితో కలిసి ఎంజాయ్ చేసేది.

"కాస్త వేడి కాఫీ పడేసరికి నాకు గొంతు పెగులుతోంది చూశావా? వెళ్ళచ్చు, కానీ మనం ఎప్పుడైనా వెళ్ళచ్చు కదా ! అంత మందితో కలిసి వెళ్ళడం ఎందుకు?" అన్నాడు చిన్నగా.

"వాళ్ళేదో గ్రూప్ బుకింగ్ చేస్తారుట, దానివల్ల ఇంకా చవగ్గా వస్తాయి, నాలుగు రోజులు చాలన్నారుట సంతోష్ అన్నీ చూడడానికి. చాలా తక్కువలో ఇంటర్నేషనల్ ట్రిప్ అని చెప్పింది శిల్ప. ఇంత మంచి ఛాన్స్ మళ్ళీ రాదేమో, అనవసరంగా మిస్ అవుతాము కదా, నీకు వాళ్ళంటే ఇష్టమే కదా, మరి ఎందుకు రానంటున్నావు?" అంది.

"ఓ, నీకలా అర్ధం అయిందా? నాకు వాళ్ళంటే ఇష్టమే, అది ప్రాబ్లెం కాదు, వాళ్ళు హాలిడే లు ప్లాన్ చేసే పద్ధతే నాకు నచ్చదు, అందుకే వద్దన్నాను, " అన్నాడు

"అంటే? అంది లతిక అర్ధం కానట్టు.

" మరేమీ లేదు, సెలవులకి సరదాగా వెళ్ళినప్పుడు అది సరదా యాత్ర లా ఉండాలి కానీ, హడావిడి యాత్రలా ఉండకూడదు కదా, వెళ్ళినప్పటినించీ వచ్చేవరకూ కాళ్ళకి చక్రాలు కట్టుకున్నట్టు, భుజాల మీద బాక్ పాక్ లు వేసుకుని తిరిగేస్తూ ఉంటే అది హాలిడే ఎలా అవుతుంది?

"అలా ఎందుకవుతుంది? అందరితో కలిసి సరదాగా వెళ్ళినప్పుడు కొంచం అటూ, ఇటూ అడ్జస్ట్ అవక తప్పదు కదా, దానికే పెద్ద ఇబ్బందా?" అంది

" కిందటి సారి సింగపూర్ వెళ్ళినప్పుడు వాళ్ళు టూర్ ఆపరేటర్ ద్వారా కుదిర్చారు కదా, ఆ నాలుగైదు రోజులు ఎలా గడిచాయో ఒక్క సారి గుర్తు తెచ్చుకో! " అన్నాడు.

"సింగపూర్ లో దిగిన వెంటనే వాళ్ళ బస్ లో హొటెల్ కి వెళ్ళామా, బాగ్ పడేసి, ముఖాలు కడిగిన తక్షణం పరిగెత్తాము సైట్ సీయింగ్ అంటూ, ఒక అరగంటైనా టైముందా? అక్కడనించీ అందరమూ ఊరిమీద పడి తిరగడం తప్ప, అందరితో కలిసి వెళ్ళడం సరదాగానే ఉంటుంది కాదనను, కానీ మనకంటూ టైమే లేకుండా ఉంటే బావుండదు, ఇదే నే చెప్పేది. "

" యూనివర్సల్, సెంటోసా, జూ, నైట్ సఫారీ, సింగపూర్ ఫ్లయర్, మర్లయన్ ఇలా ఒకటేమిటి, ప్రతీ రోజూ ఏదో ఒకటి చూడటానికి ఉరుకులూ, పరుగులే. అన్నింటికంటే చిరాకైన విషయం ఇంకోటి ఉంది, వాళ్ళు ఎప్పుడు చూడమంటే అప్పుడు చూడాలి, ఎప్పుడు వచ్చేయమంటే అప్పుడు వచ్చేయాలి. ఇదంతా మనకవసరమా? "అన్నాడు కొంచం చిరాగ్గా.

"విచిత్రమైన లాజిక్ లు చెప్పడంలో నీకు నువ్వే సాటి వినయ్. ఎవరైనా కొత్త చోటికి ఎందుకు వెళతారు? అక్కడ ఉన్న నాలుగు ప్రదేశాలు చూడటానికే కదా? కూర్చుని కూర అన్నం తినడానికీ, పుస్తకాలు చదువుకోవడానికీ అంత దూరం వెళ్ళడం ఎందుకు? ఇంట్లోనే ఉంటే అయిపోతుంది కదా? పైగా ఒకసారి వెళ్ళినచోటకే మళ్ళీ మళ్ళీ డబ్బు తగలేసుకుని వెళ్ళం కదా, అందుకే వీలున్నంతలో అక్కడున్న వన్నీ చూడటంలో తప్పేమిటి చెప్పు?" అంది విసుగ్గా.

"తప్పని నేను అనడం లేదు లతికా, నాకలా ఇష్టం లేదు అంటున్నాను అంతే, ఎవరి అభిప్రాయం వారికుండవచ్చు కానీ నా దృష్టిలో విహార యాత్ర అంటే తీరిగ్గా, హాయిగా చేసేదిగా ఉండాలి కానీ ఎవరో వెనకాల పడి తరుముతున్నట్టు ఉండకూడదు అని, కనీసం ఏడాదికొక్కసారైనా సరే "అంతే.

"నీకు గుర్తుందా, మీ శిల్పా, వాళ్ళ అక్కా టైము లేదని, ఇలాంటివారికోసమే ఇరవై నాలుగు గంటలూ తెరిచి ఉంచే ముస్తఫా షాప్ లో తెల్లవారు ఝాముున మూడు గంటలకి షాపింగ్ చేసారు, వాళ్ళతో పాటు నువ్వూ, ఆడవాళ్ళని ఒంటరిగా పంపడం ఇష్టం లేక మీ వెనకే మేమందరమూ. ఆ రోజు రాత్రి నిద్ర కూడా పోలేదు మనం, ఆ ట్రిప్ అయి వచ్చాకా ఎంత అలసిపోయామో, రెండు రోజులు పట్టింది మళ్ళీ మాములుగా అవడానికి, వీళ్ళతో వెళితే మళ్ళీ అలాంటిదే ప్లాన్ చేస్తారు, బుకింగుల పేరిట అందరికీ ఒకేసారి బుక్ చేస్తారు, మనం కావాలన్నా మానలేని పరిస్థితి వస్తుంది, అక్కడకెళ్ళాకా ఇబ్బంది పడేకంటే ముందే వద్దని చెప్తే సరిపోతుంది కదా, అని నా ఉద్దేశ్యం."

"అయితే ఇప్పుడేమటావు? " అంది లతిక విసుగ్గా, తన స్నేహితురాలు వాళ్ళు చెప్పినదాంట్లో తప్పేమిటో ఆమెకింకా తెలియడం లేదు.

"ఏమీ అనడంలేదు డార్లింగ్, ఈసారి మీతో రావడం మాకు కుదరదు అని చెప్పేయ్, ఈసారి మనిద్దరం మనకి నచ్చిన హాలిడే కి వెళదాం" అన్నాడు నవ్వుతూ.

"అయ్యో ఇంత మంచి అవకాశం, టికట్లు ఎంత తక్కువలో ఉన్నాయో తెలుసా? అంది అతన్ని ఒప్పించడానికి ప్రయత్నిస్తూ.

" అదే మనం మార్చుకోవలసినది, చవక, ఫ్రీ అంటే చాలు, దేనికైనా తయారయిపోతాము. మనకవసరమున్నా లేకపోయినా వస్తువులు చవగ్గా వచ్చాయి కదా అని కొనేయడం, ఫ్రీ గా వస్తున్నాయని నాణ్యత లేని వస్తువులు కూడా కొనేసుకుని తర్వాత బాధ పడతం, ఇదంతా ట్రాష్ నన్నడిగితే, ప్రస్తుతం మన బడ్జెట్ కూడా కొంచం వీక్ గా ఉంది కదా, ఊరికే పరిగెత్తి ఇప్పుడు అక్కర్లేని ఇంటర్నేషనల్ హాలిడే వద్దు, మనకి కావలసినది మంచి హాలిడే, కేవలం ఖరీదైన హాలిడే కాదు " కొంచం కోపంగా అన్నాడు.

"నీదంతా వితండవాదం, మొదటినించీ చూస్తున్నాను కదా, నా సంతోషం అక్కరలేదు, దాదాపు రెండేళ్ళవుతోంది మన పెళ్ళి అయి, హనీమూన్ కి అనుకున్న ట్రిప్, ఇప్పటివరకూ వెళ్ళలేదు, మంచి అవకాశం వచ్చింది కదా, సరదాగా చూసి వద్దామని అనుకున్నాను" అంది ఉక్రోషంగా.

వినయ్ మాట్లాడ లేదు, ఇంక మాట్లాడేమీ లేదన్నట్టుగా పుస్తకం లో మునిగిపోవడం లతికకి మరింత కోపం తెప్పించింది. సోఫాలోనే అటువైపు ముఖం పెట్టుకుని కూర్చుంది

రెండు నిమిషాల తర్వాత వినయే అన్నాడు, "నేను చెప్పేది విను లతికా, నేను చూసినంతవరకూ మన భారతీయుల యాత్రలన్నీ దాదాపు ఒకేరకంగా ఉంటాయి , అవి విహారయాత్రలయినా, తీర్ధయాత్రలైనా సరే"

" నాకు ఊహ తెలిసినప్పటినించీ మా బామ్మకి కాశీ యాత్ర ఒక పెద్ద కల, అది తీరకుండానే తను వెళ్ళిపోతుందేమోనని ఆవిడ ఎప్పుడూ బెంగ పడేది, అందుకని ఒకసారి నాన్న ఆవిడని తీసుకెళ్ళడానికి ప్లాన్ వేశారు, కానీ తమ్ముడికి ంలేరియా జ్వరం రావడంతో వాడిని చూసుకుంటూ అమ్మా, నాన్నా ఇంట్లోనే ఉండిపోవలసి వచ్చింది. దాంతో బామ్మని కాశీ యాత్ర చేయించే బాధ్యత మా బాబాయి మీద పడింది. నాకు సెలవులుండడంతో ఇంట్లో ఉండి అమ్మని విసిగించకుండా ఉంటానని నన్నూ బాబాయి, బామ్మలతో పాటు పంపారు."

"అలా నేను, మా బాబాయి, హైదరాబాద్ నించీ కాశీ వెళ్ళే రైలు ఎక్కాం. ఎనిమిదో క్లాస్ లోకి వచ్చాను నేను అప్పుడే, అంత దూరప్రయాణం అది కూడా అమ్మావాళ్ళు లేకుండా వెళ్ళడం, నాకు ఏదో పెద్ద విషయం లా అనిపించింది. చాలా సరదాగా రైలెక్కాను.

అప్పుడేమయిందో తెలుసా? అక్కడున్న నాలుగు రోజులూ మా బామ్మ మమ్మల్ని నించున్న చోట నిలబడనివ్వలేదు, ఒక్క క్షణం కూర్చోనివ్వలేదు, గంటకో ఘాట్లో స్నానం అంటుంది, పూటకో గుడి, ఇవి కాక గంగానది హారతులూ, అభిషేకాలు, వీటన్నింటి మధ్యా నాలుగురోజులు గడిచేసరికీ నాకూ, మా బాబాయి కి నీరసం వచ్చింది, వయసులో చిన్నవాడినేమో నాకు ఆ అలసట కి జ్వరం వచ్చింది కూడా. అంతా అయ్యి వెనక్కి వచ్చాకా అందరినీ పిలిచి ఘనంగా కాశీ సమారాధన చేయించారు నాన్న, అప్పుడొచ్చింది మా కాశీ బామ్మ.

మా బామ్మ కి వరసకి అక్క అవుతుందిట, ఆవిడ లెక్కలేనన్ని సార్లు కాశీ వెళ్ళిందిట, అందుకే ఆవిడనందరూ 'కాశీ అమ్మమ్మ, కాశీ పిన్ని, ' ఇలా ఎవరికే చుట్టరికముంటే అయితే దానికి ముందు 'కాశీ ' చేర్చి పిలుస్తారు. ఆవిడ వచ్చి భోజనం చేస్తూ మా బామ్మని ఏదో గుడి గురించి అడిగింది, మా దురదృష్టవశాత్తూ ఆ గుడి మేము చూడలేదు, అంతే మా బామ్మ మొదలు పెట్టింది.

"నీ లాంటి వాళ్ళతో వెళితే నాకు అన్నీ తెలిసేవే 'కాశీ అక్కా', ఈ కుర్రకుంకలనిచ్చి పంపాడు మా ప్రభాకరం అని మా నాన్ననీ, అన్నీ తిరగడానికి శేషుగాడికి ఓపికేదీ అని మా బాబయ్యనీ, దీనికి తోడు ఈ బాబిగాడొకడు, కాళ్ళు లాగేస్తున్నాయి, నోరెండిపోతోంది అని ఒకటే గొడవ, ఏదీ తిన్నగా చూడనివ్వలేదనుకో " అని నన్నూ సాధించింది.

" వీలైతే విశ్వనాధుడిని ఇంకొకసారి చూద్దామని మనసు తెగ పీకిందనుకో, ఏదీ పడనిస్తేనా వీళ్ళిద్దరూ? అంటూ పాఠం మొదలు పెట్టింది. " ఉన్న నాలుగురోజుల్లోనూ మూడు సార్లు చూసింది అయినా సరిపోలేదావిడకి, మళ్ళీ, మళ్లీ వస్తానేవిట్రా?" అంది పైగా.

"ఒక్క క్షణం కూడా దిక్కుతోచనివ్వలేదనుకో వీళ్ళ హడావిడితో" అంటూ మమ్మల్నందరినీ ఝాడించి వదిలింది. అదొక్కసారే కాదు,ఆవిడ బ్రతికినంతకాలమూ దెప్పుతూనే ఉంది.

"వెళ్ళినప్పటినించీ క్షణం తీరిక లేకుండా తిరిగినా సరిపోనన్ని ప్రదేశాలుంటే ఇంకొక్క రోజుంటే సరిపోయేది కదా? అది వాళ్ళకెందుకు తట్టలేదు? అని ఇప్పటికీ ఆశ్చర్యమే నాకు. ఇంకో రెండు రోజులుంటే వసతికీ, భోజనాలకీ అదనపు ఖర్చు, అదిష్టం లేదావిడకి, అలా అని ముఖ్యమైన ప్రదేశాలు మాత్రం చూసి ఊరుకోవడమూ కుదరదు. అదే మధ్యతరగతి స్వభావమేమో, అన్నీ కావాలి అని ఉంటుంది, అన్నీ కొనలేని పరిస్థితి. మనకి కావలసినదేమిటో కరక్ట్ గా తెలుసుకుని ప్లాన్ చేసుకుంటే ఈ రకమైఅన అసంతృప్తులుండవని తెలుసుకోలేని మనస్థితి."

అప్పటినించీ నాకు తెలియకుండానే అందరినీ పరిశీలించేవాడిని, అప్పటివరకూ అమ్మా, నాన్నలతో సరదాగా సెలవులకి వెళ్ళే ట్రిప్ లని కూడా తరచి చూస్తే నాకు చాలా గమ్మత్తైన విషయాలు కనిపించేవి, కేవలం మా ఇంట్లో నే కాదు, దాదాపు అందరి ఇళ్ళల్లోనూ అలాగే అని చాలా మందిని చూశాకా నాకు అనిపించింది.

మా తిరుపతి యాత్రలన్నీ వెళ్ళినప్పటినించీ ఎన్ని సార్లు దర్శనం చేసుకోవచ్చు? దర్శనం అయిపోగానే గోవిందరాజునీ, పద్మావతినీ చూడటమూ, తర్వాత ఆకాశగంగా, పాపనాశనం ఇలా తిరిగిన చోట తిరగకుండా పొద్దంతా తిరిగి, మేము తోటకూర కాడల్లా వేళ్ళాడిపోతుంటే అమ్మా, నాన్నా ఇద్దర్నీ చెరొకరూ భుజాన వేసుకుని రాత్రికి కాటేజీ చేరడం, మళ్ళీ మర్నాడు పొద్దున్నే తయారవడం. ఇంచుమించు అన్ని ట్రిప్పులూ అలాగే జరిగేవి.

ఊటీయో, కొడైకెనాలో వెళితే, ఆ జలపాతాలూ, ఈ ఫ్లవర్ గార్డెన్ లూ, లవర్స్ పాయింటులూ, సూయిసైడ్ పాయింట్ లూ అంటూ ఊరంతా తిరగడం, ఎప్పుడో అలసిపోయి హోటల్ కొచ్చి నిద్రపోవడం తప్ప నాకేమీ గుర్తు లేదు.

విహారయాత్రని మరొకలా కూడా గడపవచ్చు అని మేము కొడైకెనాల్ వెళ్ళినప్పుడు నాకు తెలిసింది. మా హోటల్ లోనే ఎదురుగా ఉన్న గదిలో ఒక విదేశీ కుటుంబం ఉన్నారు, మేము అక్కడున్న మూడు రోజులూ వాళ్ళూ, మేము రోజూ ఎక్కడో అక్కడ కలిసే వాళ్ళం, రెస్టారెంట్ లోనో, పార్క్ లోనో, మేము హడావిడిగా బయటకి వెళ్ళేప్పుడో, ఇలా.

వాళ్ళెందుకో మాలా హడావిడిగా పరుగులు పెడుతున్నట్టుగా అనిపించేవారు కాదు, పిల్లలు పార్క్ లో ఆడుకుంటూ ఉంటే పెద్దవాళ్ళిద్దరూ బెంచ్ మీద కూర్చుని కబుర్లు చెప్పుకునేవారు, లేదా అందరూ కలిసి స్విమ్మింగ్ చేసేవారు. భోజనం కూడా నిదానంగా చేసేవారు.

దాన్ని అమ్మా వాళ్ళు కూడా గమనించినట్టున్నారు.

"వాళ్ళేమిటండీ, ఊరికే హోటల్ కే అంటిపెట్టుకుపోయుంటారేమిటి? నాలుగు ప్రదేశాలు చూడాలని అనుకోరా? ఒక్క జలపాతం మాత్రం చూసి వచ్చారుట ఇప్పటివరకూ, అంతే! ఇంకో నాలుగురోజులిక్కడే ఉంటారుట కూడానూ, మన బాబి చెప్పాడు" అంది.

దానికి నాన్న" వాళ్ళు డాలర్లు రూపాయల్లోకి మార్చి ఖర్చు పెట్టుకుంటారు కనక ఎన్నాళ్ళైనా ఉండి, నిదానంగా చూస్తారు, ఇష్టం లేకపోతే ఇలా ఊరికే కూర్చుని టైము గడుపుతారు. మనకలా కుదరదు కదా, మరొక రోజు ఉండాలంటే మళ్ళీ హోటల్ చార్జీలు, భోజనాల ఖర్చులూ, అందుకే ఉన్న టైములో వీలైనన్ని చూడాలని తాపత్రయపడతాం " అన్నారు.

అప్పుడే నాకు మొదటిసారి నాకు అర్థం అయింది, హాలిడేని మరొకలా గడపవచ్చు, అని. నాన్న మాటలు అప్పుడు నిజమేనేమో అనిపించినా పెద్దవాడినయ్యాకా ఆలోచిస్తే మరికొన్ని విషయాలు స్ఫురించాయి లతికా, సెలవులు సెలవుల్లా గడపాలి తప్ప మరింత బిజీగా మార్చుకోకూడదని. మనకున్న టైములోనూ, బడ్జెట్ లోనూ వీలైనన్ని మాత్రమే చూసి ఆనందించవచ్చు, ఎవరో "అయ్యో అంత దూరం వెళ్ళి అది చూడలేదా?" అంటారని బాధ పడక్కరలేదు అనీ, "ఎలాగూ వెళ్ళారు కదా, పక్కనే ఆ ఊరు కూడానూ, అది కూడా చూసి వచ్చెయ్యవలసింది" అంటే మనసు కష్టపెట్టుకోనక్కరలేదనీ,

అందుకని ఈ సారి అలా కాకుండా ఉండాలని నేను మన హాలిడే ప్లాన్ చేశాను, నువ్వు కూడా చాలా మెచ్చుకుంటావు, నిజం " అన్నాడు.

---

ఆనాటి సంభాషణ అంతా గుర్తుకు తెచ్చుకుంటూ లతిక నవ్వుకుంటూ ఉండగానే ఉండగానే

"లతికా, చీకటిపడుతోంది, బోట్ వైపుకి వెళదామా? వెనకే వచ్చి చేతిని అందిస్తూ అన్నాడు వినయ్.

"ష్యూర్" అంది నవ్వుతూ అతని చేతిలో చెయ్యి వేస్తూ.

బోట్ లోని డైనింగ్ టేబిల్ మీద కేండిల్ వెలిగించి భోజనం ఏర్పాట్లు చేస్తున్నాడు కుక్.

పౌర్ణమి నాటి నిండు చందమామ రూపం నిశ్చలంగా ఉన్న సరస్సులో పడి, అప్పుడే పరుచుకుంటున్న చీకటి కాన్వాస్ మీద పరావర్తనం చెందిన వెలుగులో అందంగా మెరుస్తోంది వారి ఏకాంత మందిరం.

Click here to share your comments on this story